కథా నిలయం
శ్రీకాకుళం

17

# మందు

సూరిబాబు నడుస్తున్నాడు రోడ్డుపై. మళ్ళీ ఆలోచనలు వరదలా ముంచు కొచ్చాయి. సుడిగుండంలో చిక్కుకున్న చిగురాకులా తల్లడిల్లి పోయాడతను.చటుక్కున కళ్లనిండా నీళ్ళు నిండేయి.

తను చనిపోయినట్లు కలగని ఉలికిపడి లేచి ఇంకా బతికున్నట్టే తెలుసుకుని భయంతో అదిరదిరి పడ్తున్నట్టు - అతని ముప్పయ్యేళ్ళ గత జీవితం ఓ మృత్యుకలలా కళ్ళలో కదిలి వీలు చిక్కినప్పుడల్లా భయపెడ్తూనే వుంటే.... సూరిబాబు కళ్లనిండా భయంతోనే లోకంను చూడ్డం అలవాటు చేసుకున్నాడు.

సూరిబాబు నిజానికి అందరిలాగానే ఆరోగ్యంగా పుట్టేడు, కాని యిప్పుడతన్ని చూస్తే ముసలి బాలునిగా పుట్టి ముడతల మనిషిగా ఎదిగి చివరికి చీకిపోయిన తోలు బొమ్మలా మిగిలిపోయినట్టనిపిస్తాడు.

సూరిబాబు పద్దెనిమిదేళ్ళ వయసులో వున్నపుడు అతని తల్లి బావిలో దూకి చచ్చిపోయింది. ఆమెఎందుకలా చేసిందో అర్థం కాలేదు, సూరిబాబుకు. కాని ఆమె అలా ఆత్మహత్యచేసుకోడానికి ఆమె అనేక సంవత్సరాలుగా కడుపునొప్పితో పడ్తున్న బాధే కారణమని సూరిబాబు తండ్రి ఇచ్చిన లంచాన్ని తీసుకొని పోలీసులు అబద్దం చెప్పి వెళ్ళిపోయారు. వాళ్ళటు వెళ్ళిన వారానికి సూరిబాబు తండ్రి సూరిబాబునూ, అతని పెళ్ళికాని ఒక అక్కా, పెళ్ళికావాల్సిన యిద్దరు చెల్లెళ్ళతో సహా అందర్నీ వదలి ఎవతెనో పట్టుకుని ఏటో వెళ్ళిపోయాడు. సూరిబాబుకాక్షణం లోకమంతా ఓ కుళ్ళిపోయి పురుగులు పట్టిన పండులా కనిపించింది. వెంటనే అతని అక్కా చెల్లెళ్ళు కరవబోయే పులుల్లాకనబడి అతనికి తలపై పర్వతాల్లా అనిపించారు.

"ఒరేయ్, మాకు నువ్వొక్కడివే దిక్కున్న మగాడివి కాబట్టి నీకున్న ఈ నీ ముగ్గురు ఆడపడుచుల భారాన్ని భరించరా" అని నిశ్శబ్దంగా భయపెట్టే చూపులుచూశారు సూరిబాబు సోదరీమణులు.

వెంటనే సూరిబాబు సుడిగాలిలో పడ్డ కాగితం ముక్కలా పరుగెత్తుకు పోయాడు. ఊళ్ళోకి బ్రతుకు తెరువును వెదుక్కునేందుకు. ఐతే అతనికి తెరువు కనబడలేదు. బ్రతుకే వెక్కిరిస్తూ కనబడింది వికారంగా.

నెలరోజులు గడిచేసరికి సూరిబాబు అక్కయ్యంది. "నువ్వు మాకు పిడికెడు మెతుకులు పెట్టగల మగాడివనుకున్నాను - కాని.." అని.

సూరిబాబుచిల్లిపడ్డ రబ్బరుబుడగలా ముడుచుపోయేడు.

సూరిబాబు అతికష్టపడి ఓ మెడికల్ షాపులో యాభయి రూపాయల గుమాస్తాగా చేరేడు.

యాభై రూపాయలతో ఆకలి చల్లారలేదు. కాగా అతనికి అతని అక్కాచెల్లెళ్ళ కళ్ళల్లో, గుండెలపై యింకేదోరకమైన ఆకలి కనిపించి ఎలుగుబంటిని అగ్గిపుల్ల భయపెట్టినట్టు భయపెట్టింది.

యిరవై రెండేళ్ళ అక్కకు పద్దెనిమిదేళ్ళ తనుపెళ్ళి చేయడమెలా అని పులితో పోరాడవలసొచ్చిన పిల్లిలా ఆలోచించేడు సూరిబాబు, సూరిబాబుకు జవాబు దొరకలేదు. కాని ఓపెళ్ళి చేసుకోవాలనుకుంటున్న నలభై ఏడేండ్ల ముసలి వరుడు దొరికాడు.

ముసలి వరునికి సూరిబాబు అక్క నచ్చింది. కాని ఆమెకే ముసలివాడు మూల్గేనక్కలా కనిపించాడు. ఐనా ఫర్వాలేదు. బ్రతికుంటే బలుసాకు తినవచ్చని ఆ లేబుల్‌ను అంటించుకుని గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఏడాది తిరక్క ముందే చెప్పా చేయకుండా ఎందుకో సూరిబాబు ఉద్యోగం ఊడిపోయింది.

ఆ మర్నాడే సస్తులుండీ ఉండీ యిక వుండలేకపోయిన సూరిబాబు పెద్ద చెల్లెలు పేకాట కేడీ ఫకీరయ్యతో లేచిపోయింది.

సూరిబాబు గుండెలపై ఎవరికీ కనిపించని వినిపించని పెద్ద దెబ్బ తగిలింది ఆరోజు,

"జన్మలలోకెల్లా మనిషిదే ఉత్తమ జన్మ" అని ఎవడైనా అంటే వాడిని చెప్పుతో కొట్టాలన్నంత కసి పేరుకుపోయిందతనిలో.

ఉద్యోగంలేదు, యిల్లు లేదు. కట్టుకోవడానికి గుడ్డల్లేవు. కళ్ళనిండా యింకా కన్నీళ్ళు మాత్రం వున్నాయి.

ఎదురుగా యింకా లేచిపోని యింకో చెల్లెలుకూడా వుంది.

సరిగ్గా అప్పుడే అతను ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు.

"కాని తన ఆత్మహత్య వలన కలుగులాభ నష్టములేమి?" అని అతను వితర్కించుకుంటూ తర్కంలో వుండగా....

సూరిబాబు చిన్నచెల్లెలు మాత్రం ఆత్మహత్య చేసుకుంది.

తర్వాత సూరిబాబుకు బ్రతుకంటే రోతపుట్టింది.

మనుషులంటే అసహ్యం కలిగింది. లోకమంటే కసి పుట్టింది.

దాంతో అతను తెగిన గాలిపటంలా ఏటో బయలుదేరాడు. ఎక్కడెక్కడో తిరిగాడు.

ఏదో తెలియని దాని కోసం ఎక్కడెక్కడో వెదికాడు.

ఐతే అతడు బుద్ధుడుకాలేదు. బిచ్చగాడయ్యేడు. బిచ్చగాడిని పిచ్చివాడని అంటే వాడేమీ అనలేడు గాబట్టి పిచ్చివాడు కూడా అయ్యేడు.

అలా బిచ్చగాడూ కం పిచ్చివాడూ ఐన సూరిబాబు రోడ్డుపైన నడుస్తున్నాడు. చాలా నీరసంగా, ఊగుతూ, పడిపోబోతూ,

అలాంటి సూరిబాబుపైకి ఓ అందమైన కొత్తకారు బాణంలా పరుగెత్తుకొచ్చి కుఁయ్‌మని అరచి సర్రున సాగి ఆగిపోయింది. సూరిబాబుకు దెబ్బలేవీ తగల్లేదు. కాని స్పృహ తప్పి కిందపడిపోయాడు.

“దొంగ లంజకొడుకులకు వాకింగ్‌కల్చర్ లేదు” అని తిట్టుకున్నాడు కారు ఓనర్.

అతనలా తిట్టుకుంటూండగానే జనం చచ్చిన కాకిచుట్టూ బ్రతికున్న కాకులు మూగినట్టు గుమిగూడారు.

గుసగుసలు, విసవిసలు, రకారకాల వ్యాఖ్యానాలు -

కారువాడిదగ్గర్నుంచి ఏమైనా లాగుదామా అన్న ఆలోచనలు .

యీలోగా కారువాడు మెల్లిగా జారుకున్నారు. విధిలేక దిక్కులు చూస్తున్న జనం ఎదురుగా పెద్ద దిక్కుగా కనిపించిన ప్రభుత్వ గాంధీ హాస్పిటల్‌లోకి సూరిబాబును తీసుకుపోయారు.

అప్పుడు బాయ్ విసుక్కున్నాడు.

నర్స్ విసుక్కుంది.

ఐతే... బిచ్చగాడు కూడా ఈ పవిత్ర భారతదేశంలో ఓ పౌరుడే కాబట్టి డాక్టర్ చేయిని పట్టుకుని చూశాడు.

సూరిబాబును తీసుకొచ్చిన అలగా జనం అవతల చూస్తున్నారనే భయం డాక్టర్‌తో పని చేయిస్తోంది.

సూరిబాబుకు యింకా స్పృహ రాలేదు. అతన్ని స్ట్రెచర్‌పై పడుకోబెట్టి యింకా పరీక్ష చేస్తున్నాడు డాక్టర్.

ప్రక్కన నర్స్, బాయ్ బలవంతంగా ఒంటిపై గొంగళి పురుగులను ఎక్కించుకుని నిలబడ్డట్టు అతి అసహనంగా చూస్తున్నారు.

ప్రక్కన ఓ.పి.లోని రోగులు డాక్టర్ దగ్గరికి పోకుంటే తప్పకుండా చచ్చిపోతామన్నంత అతురతతో గింజుకులాడుతున్నారు.

వాతావరణం దవాఖాన ఫినాయిల్ వాసననూ, రోగుల చెమటకంపునూ కలుపుకుని గమ్మత్తయిన దుర్గంధాన్ని పులుముతోంది.

డాక్టర్ యింకాస్సేపు పరీక్ష చేశాడు. చేసి చేసి బాయ్‌తో చెప్పి చల్లని నీళ్ళు తెప్పించి ముఖం మీద చల్లించి, దూదితో అద్దించి-

సూరిబాబు కొద్దిగా కదిలి మెల్లగా కనులు విప్పుతున్నాడు. అతని ముఖం యిక ఆరిపోబోయే దీపంలా నిర్మలంగా ఉంది.

డాక్టరంటున్నాడు - "యితనికే జబ్బూ లేదు. ఆకలిగా వుండి నీరసమొచ్చి పడిపోయాడంతే...'

సూరిబాబును మోసుకొచ్చిన అలగా జనం ప్రశ్నార్థకాలైన ముఖాలను ఆశ్చర్యార్థకాలను చేసి చూస్తున్నారు.

అవతల ఓపిలో రోగులు సముద్రంలా రొద చేస్తున్నారు.

"వీణ్ణి తీస్కెళ్లండేహె... ఆకలికి మందిచ్చే దవాఖానలు యీ దేశంలోయింకా పుట్టలేదు...' అంటున్నాడు డాక్టర్.

వాని ఆకలికి మందేమిటి - ఎవరివ్వాలా మందు- సూరిబాబును బయటికి తీసుకొచ్చి అలగాజనంలోని ఎవరు అతని ఆకలిని పోగొట్టాలి... ఎవరుపోగొట్టగలరు?

అలగా జనం ఆలోచిస్తోంది... అసలు 'ఆకలి' కి మందేమిటి?

సూరిబాబు కళ్ళు తెరవలేని అశక్తతతో కళ్ళు మూసుకున్నాడు.

'సౌమ్య' మాసపత్రిక
నవంబర్ 1978